## ఈ వారం కథ

# ముడివడని ముళ్ళు

యన్. కేశవరెడ్డి

ఈ కథనెలా మొదలు పెడదామా అని ఆలోచిస్తూ ఓ పాతిక కథల్ని తిరగేసుంటాను. కానీ తృప్తికరమైన ప్రారంభం మాత్రం దొరకలేదు.

బెల్లం చుట్టూ ఈగలు ముసురుకుంటాయంటారు చూడండి అలా ముసురుకుంటున్న ఆలోచనల్ని పారదోలి వుండలేక ఏదో విధంగా కథకు శ్రీకారం చుట్టి తప్పుకోవాలనుకున్నాను.

వేగుచుక్క పొడిచింది. తెల్లారబోతోంది 'ఇదెక్కడి సుత్తిరా బాబూ' అంటూ విసుక్కుంటున్నారా... సారీ.

సరి...ఇంక నేను నిలుస్తాను.

"ఛీ నువ్వొక మొగుడివేనా? మగాడివేనా? నెలలు నెలలుగా క్రూరంగా హింసించినా సర్దుకు పోతుంటే నీలో ఏమాత్రం మార్పు రావటం లేదు. నీ యింట్లో వుండే కంటే గంపమ్ముకుని బతకడం మేలు. నీ గడప తొక్కితే చూడు"

ఎవరిదయి వుంటుందీ గొంతు—ఇంత ఉదయమే లక్ష్మి కాదు కదా అనుమానిస్తూనే లేచి చూచాను.

లక్ష్మి! ఇరవయి అడుగుల దూరంలో పోతోంది. చూస్తుండగానే సందు దాటిపోయింది.

చిత్ర హింసలకు వళ్ళప్పగిస్తూ ఎంతోకాలంగా బరువుగా బాధగా బతుకును ఈడ్చుకొస్తున్న లక్ష్మి ఈ రోజు ఇల్లు విడిచి పోయింది. ఒకందుకు మంచిదే అనిపించినా ముందు ముందు ఎలా బతుకుతుందా అనుకుంటూలేచి మూలనున్న పరకను తీసుకున్నాను. కసువూడుస్తున్నాను. కానీ లక్ష్మిపైనే మనసంతా.

లక్ష్మి రాదా యింక. వాళ్ళన్నగారింటికి పోయుంటే ఫరవాలేదు. ఈ మధ్యలో ధైర్యమొచ్చింది. ఆత్మహత్య చేసుకునేంత పిరికిదేం కాదు లక్ష్మి అనుకుంటూనే చేసేపని చేసుక పోతున్నాను.

మా యింటికి కుడివైపు మూడో ఇల్లే లక్ష్మి వాళ్ళది. లక్ష్మి భర్త ఓ ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఐదారు సంవత్సరాలయి వుండొచ్చు వారికి పెళ్ళయి. పిల్లలు లేరు. ఇంట్లో వారిద్దరే వుంటారు.

ఒకటి రెండేళ్ళు బాగా గడిచిందో ఏమో వారి సంసారం రాను రాను ఇద్దరి మధ్య స్పర్థలు రాసుకోసాగాయి. ఉండగా వుండగా యింటి పెళ్ళాం దయ్యమయిందన్నట్లుగా అయిపోయింది లక్ష్మి అతనికి.

ఇరుగు పొరుగు వారికి చులకనయిపోయారు వారు.

కసువు చెత్త కుండీలో వేసొచ్చి అంట్లు ముందేసుకున్నాను.

మనసుదారి మనసుది.

లక్ష్మి భర్త ప్రతి రోజూ ఉదయమే కోడి కూస్తూనే లేస్తాడు. పక్క సందులో ఎప్పుడూ వచ్చే కొళాయికి పోయి తొట్టె నిండా నీరు పోస్తాడు. ఆ నీటిని లక్ష్మి ఇంట్లోకి వాడుకోకుండా లావుపాటి చెక్క మూత పెడ్తాడు. మరలా ఉదయమే ఆ నీటిని పారబోసి కొత్తగా నీరు నింపుతాడు. అతడో ప్రత్యేకమయిన తరహా వాడు. లక్ష్మి మాత్రం నీటిని ఇంటి అవసరాలకు తానే ఎత్తుకొచ్చుకుంటుంది.

అతడు తాను తెచ్చుకున్న నీటితోనో లేక లక్ష్మి తెచ్చిపెట్టుకున్న నీటితోనో ఏమోగాని స్నానం చేసి ఊదుకడ్డీ (అగరబత్తి) ముట్టిస్తాడు.


ఇటువంటాయన్ను చూసే కాబోలు వేమన గారు 'ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల' అని చెప్పి వుంటారనుకుంటాను.

ఏమయితేనేమి ఆ ఊదుకడ్డీ వాసనలు నిద్రలోని మా ముక్కులకు తాకుతూనే వుంటాయి.

అతడు నీళ్ళు తెచ్చి స్నానించి ఊదుకడ్డీ వెలిగించే సరికి ఐదూముప్పయి ఐదూ నలభై అవుతుందేమో అప్పుడు కడప ఆకాశవాణిని పలికిస్తాడు. అదీ అతని రేడియోకు ఎంత గొంతుందో అంత.

గూబ గుయ్‌మంటుంటే యింకెక్కడి నిద్ర!

వాతావరణ కాలుష్యం. శబ్ద కాలుష్యం కలిగించకండని టి.వి., రేడియోలు ఎంత మొత్తుకుంటే ఏం ప్రయోజనం. సైదు కాలువలో



పిసికిన వింతపండే!

మంచి నిద్ర పాడయి పోయిందని తిట్టుకుం టూనే లేచేవాళ్ళం.

మా యింటికెదురుపక్క రెండో యింటాయన 'పిడెంత పనికిమాలినోడురా! ఎప్పుడు పాడయిపో తాడో ఏమో' అని గట్టిగానే అంటుంటాడు. ఆ సైరన్ కూతలో ఈయన గళమెంత పాపం! వినగ వినగ చెవికింపుగ వుందనుకోండి. అది వేరే విషయం.

పాత్రల్ని కడిగి కాఫీకి పెట్టాను. మావారు లేచారు. బ్రష్ వేసుకున్నారు.

కాఫీ అందిస్తూ "ఉదయమే లక్ష్మి తన భర్తను నాలుగు మాటలని ఇల్లు వదలి పోయిందండీ" అన్నాను మా వారితో.

"మంచి పని చేసింది. ఆ అమ్మాయి ఈ పని యెప్పుడో చేయాల్సింది. వాడు పెట్టే హింసలు భరిస్తూ ఇన్నాళ్ళుండటమే అదెంతో గొప్ప" అంటూ పేపరందుకుని పడక్కుర్చీలో కూర్చున్నారు.

నిజమే మరి. వాడు లక్ష్మిని హింసించిందని ఎన్ని మార్లో. అనుకుంటే కడుపు తరుక్కుపో తుంది. నా దగ్గరకొచ్చి చెప్పి చెప్పి ఏడ్చేది. పాపం లక్ష్మి!

వంట పనిలో పడినానేగాని లక్ష్మిని గురించి అనుకోకుండా వుండలేక పోతున్నాను.

ఒకరోజు లక్ష్మి ఎదురింటాయనతో మాట్లా డుతుండగా అతడు వస్తూ చూసాడట. అంతే పశువును బాదినట్లు బాదాడు. వీపుడు.

వీపు పచ్చి పుండయింది రక్తంతో తడిసి. ఎంతగా విలపించిందో లక్ష్మి ఆ రోజు. ఎంత దుర్మార్గం!

అప్పటి నుండి అతడు బయటికి పోయినప్పు డల్లా లక్ష్మిని యింట్లో పెట్టి తాళం వేసేవాడు. ఎప్పుడోగాని ఊరక పోదు.

భయంకరమైన జైలు శిక్ష!

ఇంకోరోజు సంతోషంగా మాట్లాడుతుంటే లక్ష్మి కొంత చొరవచేసి దగ్గరకు పోయిందట.

అంతే. అతనికేమనిపించిందో ఏమో "నీ కొక్కడు చాలడే" అంటూ తొడలమీద రొమ్ముల మీద సిగరెట్టుతో కాల్చాడు ఆ రాక్షసుడు.

"ఎన్నాళ్ళు ఈ బాధల్ని భరించాల"ని కుమిలి కుమిలి ఏడ్చి చెప్పుకునేది లక్ష్మి.

బియ్యం అమ్ముకున్నావనో బేడలు అప్పుడే ఖాళీచేసావనో ఏదో ఒక సాకు పెట్టి అతడు లక్ష్మిని బాధించని రోజు వుండదు. "పెండ్లాన్ని కొట్టా లనుకున్నప్పుడు పెరుగులో రాళ్ళు కనపడతా" యంటారు నిజమేనేమో!

రామ రామ అతడు త్రాగుడు, జూదం వంటి వ్యసనాలకు బానిసయిపోయాడు. లక్ష్మిని హింసించడం మరీ యెక్కువయిపోయింది.

ఎవరయినా ఎన్నాళ్ళని భరిస్తారు చిత్రహిం సల్ని. విసిగిపోయి లక్ష్మి ఈ రోజు ఆ నరకం నుంచి బయటపడింది. ఒకందుకు మంచిదే!

"విన్నావా ఓ ప్రబుద్ధుని నిర్వాకం "పిలుస్తు న్నట్టుగా అన్నారు మావారు, పేపర్లో నుంచి.

"ఏమిటి" అంటూ దగ్గరకు పోయాను ఆలో చనల్ని ఓ ప్రక్కన పెట్టి వంట గదిలోనుంచి.

"నాసరాల్లోనంట ఒక ప్రభుత్వ ఉద్యోగి తన భార్యను గొంతు పిసికి చంపి రాత్రికి రాత్రే కాల్చి ఆనవాలు చిక్కకుండా బూడిద చేసాడట"

"అంత కానిపని ఏం చేసిందంట ఆమె" అడిగాను మావారిని.

"ఇంటికే రాకుండా అతను క్లబ్బుకే అతు క్కుపోయాడట రెండు రోజులపాటు. ఆమె క్లబ్బుదగ్గరకే వచ్చి గట్టిగా నాలుగు మాటలనిం దంట" క్లుప్తంగా చెప్పారు మావారు.

"పెండ్లాన్నీ, పిల్లల్నీ కొద్దిగ పట్టించుకోమని చెప్పడం కూడా తప్పయిందా ఆ మగ మహా రాజుకు' ' వళ్ళు మండుతుంటే అన్నాను.

"ఏమో" అంటూ మా వారు మళ్ళీ పేపర్లో పడిపోయారు.

ఆర్థికంగా సాంఘికంగా వెనుకబడిన వారిని ఉద్ధరించాలనీ, అబలలపై జరిగే అత్యాచారాలనూ, అన్యాయాలనూ అరికట్టాలనీ యెన్నో ఉద్య మాలు బయలుదేరాయి. వేదికలపై ఉపన్యాసాలు ధారాళంగా సాగుతూనే వున్నాయి. కాని యెవరు బాగుపడినారు? మనుషుల్లో ఎంత మాత్రం మార్పు వచ్చింది? వెనుకబడినవారు వెనుకబడే వున్నారు. ఆడవారిపై అత్యాచారాలు జరుగు తూనే వున్నాయి. ఉద్యమాలవల్ల నిజంగా బాగుపడింది యెవరంటే, నాయకులే! వారి బాగు కోసమే ఉద్యమాలు పుడుతున్నాయి, పెరుగుతున్నాయి. మనుషుల్లో మాత్రం మార్పు రావటం లేదు.

వంటింట్లో నుంచి మాడు వాసన తగిలింది. పరిగెత్తాను.

లక్ష్మి ఇల్లు వదిలిన నెల రోజుల్లో వాళ్ళాయన సెలవుపెట్టి బదిలీ చేయించుకునే ఉద్దేశంతో ఇల్లు ఖాళీ చేసి వాళ్ళూరికి పోయాడు.

రెండు నెలు గడిచాయి.

ఊహించని విధంగా లక్ష్మి ఒక రోజు కూరగా యలమ్ముతూ గంప నెత్తిన పెట్టుకుని ఇంట్లోకి వచ్చింది.

నేను నమ్మలేక పోయాను. లక్ష్మిలో ఎంతో మార్పు వచ్చింది. కాఫీ త్రాగుతూ మాట్లా డుకున్నాం.

ఇదే ఊరిలోనే వుంటున్న తన అన్నయ్య ఇంట్లోనే లక్ష్మి వుంటోంది. లక్ష్మిని యింటికి రమ్మనమని భర్త ఒకరిద్దరిని మధ్యవర్తులను పంపినాడంట! కానీ పోవటానికి లక్ష్మి ససేమిరా ఒప్పుకోలేదు.

వారి బంధం తెగిపోయినట్లుగానే భావించవచ్చు.

"ఆడవారికి ఆర్థిక స్వాతంత్ర్యం చాలా అవ సరం. మన కాళ్ళపై మనం నిలవడగల్గినప్పుడు మగవారు అంత సులువుగా చేయి చేసుకోలేరు. మనసులు కలవనప్పుడు మూడు ముళ్ళ బంధం నరకమే! నేను నేనుగా బతకాలనుకుంటు న్నాను"

మెచ్చుకోలుగా చూసాను లక్ష్మివైపు. ఆ మాటలు నన్ను ఆకట్టుకున్నాయి.

గంప నెత్తిన పెట్టుకుని "కొయిటాకూ, గోగాకూ, ఎరగడ్డలూ, తమేట పండ్లమ్మో" అంటూ సాగిపోయింది లక్ష్మి.

ఆ అడుగుల్లో తడబాటు లేదు ★



## "మాలపల్లి' నవల

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. గుంటూరులో శారదానికేతనం స్థాపించి స్త్రీ విద్యకై అవిరళ కృషి సల్పారు. వారి "మాలపల్లి" నవల నాటి సమాజాన్ని యథాతథంగా చిత్రించింది. అందులోని ప్రతిపాత్రా నాటి నిజ జీవితం నుంచి గ్రహించిందే!

అయితే ఇంత గొప్ప 'మాలపల్లి' నవలను పంతులుగారు ఎక్కడ వ్రాసారో, ఎలా వ్రాసారో తెలుసా? హాయిగా ఇంట్లో భోజనం చేసి కూర్చుని వ్రాయలేదు. మూడ్ కోసం ఏ సిగరెట్లో తాగుతూ వ్రాయలేదు.

మరి ఎలా వ్రాసారు? 1923లో స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటిష్‌వారిచే జైలు శిక్ష వేయబడి, జైలులో కటకటాల వెనుక కిరోసిన్ దీప కాంతిలో (పగలు వ్రాస్తే గొడవలు కావచ్చుని) వ్రాసారు. తర్వాత రహస్యంగా అది బయటకు చేరింది. బెల్లంకొండ రాఘవరావు అనే దేశభక్తుడు అచ్చువేసాడు.

డాక్టర్ మల్లీప్రియ "నాగరాజు"